క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



గాడుబావి వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింత మాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువాం వైశాఖ మాస అమావాస్య పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ నిర్వహించి మహామంగళహారతి నిర్వహించారు.

ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కోట్ల



కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డికి అయోధ్యరాముడి చిత్ర పటాన్ని అందజేస్తున్న కిశోర్‌కుమార్

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామిని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏకశిలారూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించి తీర్థప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భం గా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కిశోర్‌కుమార్ ఎమ్మెల్యే కోట్లను సన్మానించి అయోధ్య శ్రీరాముడి చిత్ర పటం అందజేశారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక



ఉపకార వేతనలకు ఎంపికైన విద్యార్థులతో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు నేషనల్‌మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. సాయిచేతన్, యతేంద్రసాయి, చైతన్య, అస్లామ్, రాజేష్, సాయిరామ్ నాయక్ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామలక్ష్మీ గురువారం తెలిపారు. ఈ విద్యార్థులకు ఏడాదికి రూ.12వేల ప్రకారం నాలుగేళ్ల పాటు ఉపకారవేతనం లభిస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

చంద్రబాబు, లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే బీసీ



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె : ఉండవల్లి నివాసంలో గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌బాబును బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే బీసీని అభినందించారు.

రామేశ్వరస్వామికి జలాభిషేకం



కలశాలతో జలాన్ని తీసుకెళ్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరులో వెలసిన రామేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తులు శివుడికి జలాభిషేకం చేశారు. అర్చకులు భాస్కరయ్య ఆధ్వర్యంలో 108 కలశాలతో జలాన్ని తీసుకొచ్చి రామేశ్వరస్వామికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ వైశాఖమాసం అమావాస్య రోజు శనీశ్వరుడి జయంతిని రోజున జలాభిషేకం నిర్వహిస్తే ఎంతో మంచిజరుగుతుందన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ రద్దు

కొలిమిగుండ్ల: ఎన్నికలకు ముందు చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు రద్దు చేస్తూ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కొలిమిగుండ్ల మండలంలో సాధారణ ఎన్నికలకు ముందుగా ఇద్దరు ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. పెట్నికోట ప్రాథమిక, కొలిమిగుండ్ల బీసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినులు ఇందిర, గాయిత్రి కోవెలకుంట్ల,నంద్యాలకు బదిలీపై వెళ్లారు. విద్యాశాఖ కమిషనర్ తీసుకున్న నిర్ణయంతో వీరు పాత స్థానాల్లో తిరిగి చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది.



కోవెలకుంట్ల మండలం గుంజలపాడు సమీపంలో చెరువును తలపించేలా పొలాల్లో చేరిన వర్షపునీరు



ఇంటి ఎదుట కుంటను తలపిస్తున్న వర్షపు నీరు



జలమయమైన కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం



పొలంలో భారీగా నిలిచిన వర్షపునీరు

భారీ వర్షం!

- పొంగిన వాగులు, వంకలు
- జలమయమైన కాలనీలు
- అవుకు మండలంలో 33.4 మి.మీ వర్షం



దద్దణాల ప్రాజెక్టుకు చేరిన నీరు

కోవెలకుంట్ల: నైరుతి రుతుపవనాల ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురువడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో భారీగా వర్షపునీరు చేరి జలమయమైంది. వివిధ కాలనీలు జలమయం అయ్యాయి. అవుకు మండలంలో అత్యధికంగా 33.4 మి.మీ, కొలిమిగుండ్లలో 31.8 మి.మీ, దొర్నిపాడులో 26.6 మి.మీ, కోవెలకుంట్లలో 20 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండటంతో ఈ ఏడాది సీజన్ అన్ని విధాలా కలిసొస్తుందని రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు.

డోన్‌లో 49.2 మిమీ వర్షం

డోన్ టౌన్ : పట్టణంతోపాటు గ్రామాల్లో గురువారం తెల్లవారు జామున ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దాదాపు మూడు గంటల సమయంలో మొదలైన వర్షం ఉదయం వరకు కురిసింది. ఈదురు గాలులకు కరెంటు సరఫరా నిలిచి పోవడంతో పట్టణంలో అంధకారం నెలకొంది. 49.2 మీమీ వర్ష పాతం నమోదు అయిందని సహాయ గణాంక అధికారి తెలిపారు. విత్తన సాగుకు అదను కావడంతో రైతులు కంది,పత్తి పంటలు సాగుకు సిద్ధం అవుతున్నారు.

డోన్ రూరల్ : మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి వంకలు, వాగులు పొంగిపొర్లాయి. గ్రామాలలో వర్షపు నీరు చేరి ఇళ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వస్తువులు, ధాన్యపు గింజలు పూర్తిగా నీటి మునిగిపోయాయి. పొలాలు జలమయమయ్యాయి.

కొలిమిగుండ్లలో కుండపోత

కొలిమిగుండ్ల: నైరుతి రుతుపవనాల ప్రభావంతో కొలిమిగుండ్ల మండలంలో గురువారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. బెలుంలోని పురాతన సిద్ధరామేశ్వరస్వామి ఆలయంలోకి భారీగా నీరు చేరింది. గర్భగుడిలోని శివలింగం నీట మునిగింది. గ్రామాల్లో పంట పొలాల్లో నీరు చేరడంతో వంకలను తలపించాయి. 31.8 మి.మీ వర్షపాతం నమోదైంది. బెలుం,కల్వటాల తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉరుములు,మెరుపుల ప్రభావంతో కొలిమిగుండ్ల సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది.

బేతంచెర్లలో 9 సెంటీ మీటర్ల వర్షపాతం

బేతంచెర్ల : మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. బేతంచెర్ల పట్టణంలోని అయ్యల చెర్వువాగు, బలపాలపల్లె రహదారిలోని వాగుతోపాటు, డోన్ రహదారిలోని ముచ్చట్లవాగు ఉధృతంగా ప్రవహించాయి. ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ సమీపాన పెద్ద వనుము బ్రిడ్జి దగ్గర నీరు భారీగా చేరడంతో వాహనాల రాకపోలకు అంతరాయం ఏర్పడింది. మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలోని మద్దిలేరయ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యినట్లు ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు.

పొంగిపొర్లిన వాగులు, వంకలు

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు వివిధ గ్రామాలలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజమున వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అధికారులు లెక్కల ప్రకారం 93.0 మి.మీ వర్షపాతం నమోదు అయింది. ముదిగేడు వద్ద ఉన్న పాలేరు ఉధృతంగా ప్రవహించడంతో కోవెలకుంట్ల నుంచి అవుకునకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే సంజామల శివారులో ఉన్న పాలేరువాగు పొంగిపొర్లింది. కొండసుంకేసుల నుంచి కోవెలకుంట్లకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సంజామల వద్ద వాగులో చిక్కుకుంది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో 25 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆకుమల్ల గ్రామంలోని పురాతనమైన కుంట నిండిపోయింది.



సిద్ధరామేశ్వరస్వామి ఆలయంలోకి చేరిన వర్షపునీరు,



పొలంలో నిలిచిన వర్షపు నీరు



ఆకుమల్లలో నిండిన కుంట

ఎత్తిపోతల పథకానికి గండి

బనగానపల్లె : మండలంలోని యాగంటి సమీపంలోని ఎత్తిపోతల పథకానికి బుధవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి ఆనకట్ట కోతకు గురికావడంతో గండిపడింది. గండిపడడంతో ఫర్క్యులేషన్ ట్యాంకులోని నీరు బయటికు వెళ్లిపోవడంతో ఖాళీ ఏర్పడింది. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని గండిని పూడ్చివేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



గండిపడిన దృశ్యం

దద్దణాలకు జలకళ

బనగానపల్లె: బనగానపల్లె ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. 33.0 మీ మీ వర్షపాతం నమోదైంది. దద్దణాల ప్రాజెక్టుకు14 అడుగుల నీరడంతో జలకళ సంతరించుకుంది. పరివాహకప్రాంతాలైన జలదుర్గం, కటికవానికుంట, యాగంటి ప్రాంతాల నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ప్రాజెక్టు లోనికి నీరు చేరింది.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

బేతంచెర్ల: నగర పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నాయకుడు ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్మికుల సమావేశంలో వా రు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం నగర పంచాయతీ కార్మికుల నూతన కమిటీ ప్రకటించారు. కార్యక్రమంలో కార్మికులు రంగడు, ఎల్లయ్య, జలీల్, కాశీ, నాగరాజు, చందు, తిరుమలేష్, వెంకటేశ్వర్లు, భీమన్న, మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

60 ఏళ్లు దాటిన వారందరికీ బీసీజీ టీకా

- రాష్ట్ర నోడల్ అధికారి రామనాథరావు



బీసీజీ టీకాల ప్రక్రియను పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి రామనాథరావు

కోవెలకుంట్ల: అరవైఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి టీబీ సోకకుండా బీసీజీ టీకా వేయించాలని హెల్త్ ప్రోగ్రాం రాష్ట్ర నోడల్ ఆఫీసర్ రామనాథరావు సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు, మాయలూరు ప్రాథమి ఆరోగ్య కేంద్రాలను జిల్లా అధికారిణి డాక్టర్ సునీత, ఇమ్యునైజేషన్ అధికారిణి ప్రసన్న లక్ష్మి, డాక్టర్ శ్రీజతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని కలుగొట్ల, సొదరదిన్నె గ్రామాల్లో బీసీజీ టీకాల ప్రక్రియను పరిశీలించారు. ఆయా పీహెచ్‌సీల్లో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని, రాబర్ట్ కెన్నేడి, అశోక్, మునిస్వామి, వీరభద్రుడు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ ఢీకొని ఇద్దరికి గాయాలు





గాయపడిన అశోక్‌కుమార్, విజయ్‌కుమార్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల – నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. స్థానిక స్వామి నగర్ కాలనీకి చెందిన అశోక్‌కుమార్, విజయ్‌కుమార్ ఇందిరమ్మ కాలనీ నుంచి బైక్‌పై వస్తుండగా నంద్యాలవైపు నుంచి వస్తున్న కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో బస్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో విజయ్‌కుమార్‌కు కాలు విరగగా, అశోక్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించండి



మాట్లాడుతున్న గోవిందనాయక్

నంద్యాల(సెంట్రల్): వర్షాకాలం మొదలవుతుండడంతో జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ సిబ్బంది అప్రమత్తతో ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్ సూచించారు. గురువారం స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో సహాయ సంచాలకులు, మండల పశు వైద్యులు, పారా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సచివాలయాల్లో కొత్తగా నియమితులైన పశుసంవర్ధక సహాయకులు సంబంధిత పశువైద్యులు, సీనియర్ల సలహాలతో రైతులకు తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఇన్సూరెన్స్ పోస్టు మార్టం, సెక్స్ సోర్టెడ్ సెమెన్, సర్వీసు రిజిస్టర్‌ల విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వపరంగా పాడి రైతులకు అందే సాయంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యాక్సినేషన్ విషయంలో ఏమాత్రం అలక్ష్యం వద్దని, నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో చేరుకోవాలని ఆదేశించారు. ఉపసంచాలకులు రమణమూర్తి మాట్లాడుతూ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, కొత్తగా నియమితులైన ఏహెచ్‌ఏలు తమకు కేటాయించిన స్థానాల్లో నిత్యం రైతులకు అందుబాటులో ఉండి మంచి పేరు తెచ్చుకోవాలని ఆదేశించారు.

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

డోన్ టౌన్ : దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకానందుడిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వివేకానంద సేవా సమితి కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టి పిలుపునిచ్చారు. వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను గురువారం ఆయన స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కరూర్ వైశ్యాబ్యాంక్ తదితర ప్రధాన బ్యాంక్‌లతో పాటు పట్టణంలోని ప్రముఖుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. స్వామి వివేకానంద చరిత్రను పిల్లలకు పెద్దలు వివరించాలని ఈ సందర్భంగా జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల: ప్రాచీన కాలం నుంచి నేటి వరకు విజ్ఞానం అందించే గ్రంథాలయాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి మధు శేఖర్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఏప్రిల్ 29 నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ముగిసింది. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన కథలు, కాంపిటీషన్ పుస్తకాలను అందుబాటులో ఉంచడమే కాకుండా, పెయింటింగ్, కంప్యూటర్ శిక్షణతో పాటు క్యారమ్, చెస్ పోటీలు నిర్వహించామన్నారు. కంప్యూటర్ శిక్షణ మాత్రం నిరంతరం కొనసాగుతుందని, నిర్ణీత ఫీజు చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పించిన స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్ : కుటుంబ కలహాలతో డోన్‌కు వచ్చి ఇబ్బందులు పడుతున్న నంద్యాలకు చెందిన వృద్ధుడు మహమ్మద్‌గౌస్‌ను స్ఫూర్తి సభ్యులు చేరదీశారు. ఈ మేరకు గురువారం వృద్ధుడిని గుత్తి రోడ్డులోని పద్మావతి వృద్ధాశ్రమంలో చేర్పించారు. అభాగ్యులకు ఆశ్రయం కల్పిస్తున్న ఆశ్రమ నిర్వాహకురాలు పద్మకు స్ఫూర్తి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్ఫూర్తి వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు, సభ్యుడు బాషా పాల్గొన్నారు.

హోటళ్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఉమ్మడి జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కుర్మా నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లను ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారులు వెంకటరాముడు, ఖాసింవలితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రతి హోటల్, రెస్టారెంట్ ఇతర ఆహార పదార్థాలను విక్రయించే దుకాణాల యజమానులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను పాటించాలని సూచించారు. బస్టాండ్ వద్ద ఉన్న హోటల్ డిలైట్ లో సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించామన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక వృద్ధుడి మృతి



నారాయణరెడ్డి (ఫైల్)

డోన్ టౌన్: పట్టణంలోని వైఎస్ నగర్‌కు చెందిన వృద్ధుడు పంచలింగాల నారాయణ రెడ్డి (70) వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక తీవ్ర అసంతృప్తితో మృతి చెందాడు. ఈ నెల నాలుగో తేదీ వెలువడిన ఫలితాలను టీవీలో చూసినప్పటి నుంచి ముభావంగా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా టీవీకే పరిమితమైన వృద్ధుడు బుధవారం సాయంత్రం అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగించాడని, అయినా ఓటమి ఏమిటని నారాయణ రెడ్డి అసహనం గురయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం మృతుడి అంత్యక్రియల కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీబాటపై ర్యాలీ

కోవెలకుంట్ల: మూడు సంవత్సరాలు నిండి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని గురువారం కోవెలకుంట్ల పట్టణంలో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు, తల్లులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ చంద్రమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు మధ్యాహ్నభోజనం, ప్రతి రోజు గుడ్డు, పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్త దాడి



చికిత్స తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త అబ్దుల్‌షికూర్

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని జీఎం టాకీసు వద్ద ఇల్లూరు కొత్తపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అబ్దుల్‌షికూర్‌పై టీడీపీ కార్యకర్త అక్బర్ దాడి చేసిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. బాధితుడు అబ్దుల్‌షికూర్ తెలిపిన వివరాల మేరకు ఇల్లూరుకొత్తపేటకు చెందిన అబ్దుల్‌షికూర్ కొంతకాలం నుంచి బనగానపల్లెని పాతబస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని జీఎం టాకీసు సర్కిల్ వద్ద అబ్దుల్‌షికూర్ తనకు తెలిసిన కొందరితో ఎన్నికల గురించి మాట్లాడుకుంటున్నారు. అయితే బీసీ కాలనీకి చెందిన టీడీపీకి కార్యకర్త అక్బర్ మధ్యలో అనవసరంగా జోక్యం చేసుకుంటూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించాడు. అయినా ఓర్పుతో ఉన్న అబ్దుల్ షికూర్‌ను, అక్బర్ పక్కనే ఉన్న బండరాయితో తలపై బలంగాకొట్టి హత్యాయత్నానికి పాల్పడినట్లు అబ్దుల్‌షికూర్ తెలిపారు. బాధితుడు స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నాడు.

మహానందిలో భక్తుల సందడి



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహానంది: వేసవి సెలవులు ఉండటంతో మహానంది ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అలాగే మహానందిలో కొలువైన శ్రీవీరభద్రస్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కోదండ రామాలయం, వినాయక నంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం

మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరిదేవి, మహానందీశ్వర దంపతులకు గురువారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్యధారణ, అక్షింతల సమర్పణ చేశారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.